ఉల్లి.. రైతులు తల్లడిల్లి

- అన్నదాతలను ముంచిన కేపీఉల్లి
- మండలంలో 800 ఎకరాల్లో పంట సాగు
- వర్షానికి పంటకు తెగులు
- ట్రాక్టరుతో పంటను దున్నేసిన రైతులు
- కానరాని క్రాప్ ఇన్సూరెన్స్


చింతలచెరువులో తెగులు సోకి దెబ్బతిన్న కేపీ ఉల్లి పంటను ట్రాక్టరుతో తొలగిస్తున్న రైతు

చాగలమర్రి: కోటి ఆశలతో సాగు చేసిన ఉల్లి రైతులను తల్లడిల్లేలా చేసింది. ఆరుగాలం కష్టపడినా శ్రమ వృథా అయ్యింది. ఈ దఫా తమ కష్టాలు తీరుతాయనే వారి ఆశలు అడియాసలయ్యాయి. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన అన్నదాతలకు చివరికి కన్నీరే మిగిలింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పంట కుళ్లిపోయి, తెగుళ్ల ఆశించడంతో పంట దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లింది.

ముంచిన వాన

మండలంలోని చింతలచెరువు, కొలుములపేట గ్రామాలు కేపీ ఉల్లికి పెట్టింది పేరు. ఈ గ్రామాల్లో కొన్నేళ్లుగా కేపీ ఉల్లి పంటను అత్యధిక శాతం రైతులు సాగు చేస్తున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా రైతులు పంట సాగు చేశారు. ఎకరానికి రూ.4 వేలు వెచ్చించి సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో ఉల్లి పంటను సాగు చేశారు. అయితే పంట చేతికి అంది వస్తుందనుకున్న తరుణంలో భారీ వర్షాలు దెబ్బతీశాయి. ఎకరా పంట సాగుకు సుమారు రూ.50,000లకు పైగా ఖర్చు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నీరు నిల్వ చేరింది. తెగుళ్ల సోకి పంట కుళ్లిపోయింది. తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతలచెరువు గ్రామంలో రైతులు ఎద్దుల నాగరత్నారెడ్డి-2, పసుపల మద్దిలేటి యాదవ్-4, ఎద్దుల చంద్రమౌళిరెడ్డి-4, పసుపుల ఓబుల్‌రెడ్డి-2, ఎద్దుల పరమేశ్వరరెడ్డి-3, ఎద్దుల లక్ష్మీరెడ్డి-4, ఎద్దుల జయరామిరెడ్డి-3, పాశెం కొండయ్య-3, ఎస్.మునిస్వామి-4, కోటేశ్వరరావు-1, రామచంద్రరెడ్డి-5, సుమన్-2 ఎకరాల్లో సాగు చేసిన కేపీ ఉల్లికి వైరస్ సోకడంతో ట్రాక్టర్లతో దున్నేశారు. మండలంలోని చిన్నవంగలి, ఆవులపల్లె, డి.కొత్తపల్లె గ్రామాల్లోని రైతులు సుమారు 400 ఎకరాల్లో పంట సాగు చేశారు. కొందరికి అరకొర పంట దిగుబడి వచ్చినా నాణ్యత లేకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మండలంలో సుమారు రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు.


తెగులు, వైరస్ సోకి దెబ్బతిన్న ఉల్లి పంట

నష్ట పరిహారం అందజేయాలి


సాగు చేసిన ఉల్లి తెగుళ్ల సోకడంతో దెబ్బతింది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. దిగుబడి భారీగా తగ్గినా నాణ్యత సరిగ్గా లేదని వ్యాపారులు తక్కువ ధరకు కొను గోలు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనా వేసి పరిహారం అందించేలా చూడాలి.
–నాగరత్నారెడ్డి, రైతు, చింతలచెరువు

అధికారులు స్పందించాలి


గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంట నష్టం వాటిల్లితే వెంటనే వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలించేవారు. పంట నష్టాన్ని అంచనా వేసి ఆర్‌బీకేల ద్వారా జాబితాను రూపొందించి పరిహారం అందించే ఏర్పాట్లు చేసేవారు. కూటమి ప్రభుత్వంలో పంట నష్టపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.
–ఎద్దుల చంద్రమౌళిరెడ్డి, రైతు, చింతలచెరువు

దిగుబడి వచ్చినా ధర లేదు


నాకున్న ఎకరా పొలంలో పెద్ద బళ్లారి ఉల్లి పంట సాగు చేశాను. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చిందని సంతోషపడ్డాను. మార్కెట్‌లో ధరలు పడిపోయాయని ఒక క్వింటాకు రూ.1000 మాత్రమే ఇస్తామని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తే బాగుంటుంది. –నారాయణమ్మ, రైతు, చిన్నవంగలి

చెంచుల సమగ్రాభివృద్ధికే సర్వే


చెంచుగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చాగలమర్రి: చెంచుల సమగ్రాభివృద్ధికే సర్వే నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సమగ్ర సర్వేను ప్రత్యేకించి నంద్యాల జిల్లాలోని 42 చెంచు గూడెంలలో కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. చాగలమర్రి మండలంలో ఉన్న 2 చెంచు గూడెంలలో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం మండలంలోని డి.వనిపెంట పంచాయతీ మజారా గ్రామమైన చెంచుగూడెం, చాగలమర్రి గ్రామంలోని చెంచుగూడెంలో సర్వే చేశారు. సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు రేషన్, గ్యాస్, పక్కాగృహం సహా 34 అంశాలపై వివరాలు సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. చెంచులకు మౌలిక సదుపాయాలు, జీవనోపాధి మెరుగునకు ఈ సర్వే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు మనోజ్, ఫైరోజా, వీఆర్‌ఓలు సోహెల్, శారద తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకులు

దొర్నిపాడు: ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకుల సంఘం మండల అధ్యక్షుడు జుమ్మల రామదాసు, కార్యదర్శి బాల ఉసేని తహసీల్దార్ సుభద్రకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అలాగే బోయలను ఎస్టీల్లో చేర్చాలని ఉద్యమాలు చేసిన సమయంలో అక్రమ కేసులు పెట్టారని.. వాటిని వెంటనే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ వెంకటేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. సంఘం నాయకులు విజయ్‌కుమార్, నాగేష్, నాగశేషుడు, బాల దాసు, ఆంజనేయులు, బాలయ్య, పల్లె పెద్దఉసేని, శ్రీనివాసులు, క్రిష్ణయ్య, బోయ సుబ్బమ్మ, ఉష పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


తహసీల్దార్ కార్యాలయ మార్గంలో వేస్తున్న సీసీరోడ్డు

రుద్రవరం: మండల కేంద్రంలోని సీఎం రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు పీఆర్ ఏఈ కమాల్ సాహెబ్ తెలిపారు. మొత్తం 150 మీటర్ల పొడవున రూ.8 లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నట్లు పేర్కొన్నారు. పనులను ఎంపీడీఓ భాగ్యలక్ష్మి పరిశీలించారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డిని అభినందిస్తున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేస్తున్న పీడీ హెచ్ బాబు పదవీ కాలం ముగియడంతో అధ్యక్షుడు రావినూతన దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీనియర్ల సహకారంతో బార్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మద్దిలేటిస్వామిరెడ్డి, పెద్ది శ్రీనివాసులు, ముక్కెర కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, సుదాంశమౌళిరెడ్డి, ప్రతాపరెడ్డి, హరిప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

మందుల దుకాణంలో తనిఖీలు


పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏఓ రంగనేతాజీ

చాగలమర్రి: మండల కేంద్రంలోని ముత్యాలపాడు బస్టాండ్ శెట్టివీడు రస్తాలో నిర్వహిస్తున్న శ్రీగురుదత్త పెస్టిసైడ్స్ దుకాణాన్ని ఏఓ రంగనేతాజీ సోమవారం తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న క్రిమి సంహారక మందుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. కొన్ని శాంపిల్స్ సేకరించారు. క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

బీజేపీ కార్యకర్తలతో సమావేశం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశం సోమవారం స్థానిక ఆ పార్టీ పార్లమెంటరీ కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు చంద్రమౌళి, అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. కశెట్టి కృష్ణమూర్తి, లింగన్న, ఇంటి ఆదినారాయణ, సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి శంకర్, చౌడప్ప మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఐఎఫ్‌టీయూ నంద్యాల డివిజన్ నాయకులు ఫరూక్, ఖాజామియా, పఠాన్‌రఫీ, పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు అశోక్, వెంకటేశ్వర్లు, లింగన్న, రమణమ్మ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రానివ్వొద్దు

- సచివాలయ సిబ్బంది నిబంధనలకు లోబడి పనిచేసేలా చర్యలు తీసుకోండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో శంకుస్థాపన చేసిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు ఇసుక కొరత రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనుల శాఖ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల్లో శంకుస్థాపన చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఇసుక ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ మొత్తాలను శత శాతం పూర్తి చేయడంపై అధికారులను అభినందించారు. అలాగే.. పెండింగులో ఉన్న పెన్షన్ మొత్తాలను తిరిగి జమ చేయాలన్నారు. పెన్షన్ మొత్తాన్ని తిరిగి చెల్లించని నెరవాడ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశామన్నారు. అతనిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది సీసీఏ రూల్స్‌కు లోబడి పని చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వారంలో రెండు పర్యాయాలు సచివాలయాలను పర్యవేక్షించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సచివాలయ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతో పాటు అర్జిత సెలవులను సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పనిచేయని బయోమెట్రిక్ డివైజ్‌లను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాని సిద్ధం చేశామని, ఈనెల 9, 10, 23, 24 తేదీలలో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించి జాబితాలో చేర్పులు మార్పులు చేయాలన్నారు. నంద్యాల, డోన్ డివిజన్లలో రైల్వే శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రోడ్డు ఓవర్ బ్రిడ్జ్, రోడ్డు అండర్ బ్రిడ్జ్ పనుల నివేదికలను పంపాలన్నారు. ఈనెల 9వ తేదీ ముఖ్యమంత్రి శ్రీశైలం పర్యటనకు వస్తున్నారని, ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని పర్యాటక, రెవెన్యూ, పంచాయతీరాజ్, దేవదాయ, జలవనరులు, మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ కింద గోకులం షెడ్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు మంగళవారం సాయంత్రంలోపు పంపాలన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

సేవలకు అడ్డుపడితే ప్రజలే బుద్ధి చెబుతారు


మహిళకు చెక్కు అందజేస్తున్న శిల్పా రవి

నంద్యాల(అర్బన్): దాదాపు ఇరవై ఏళ్లుగా శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజలకు సేవలు అందిస్తున్నామని, సేవలకు అడ్డుపడితే ప్రజలే బుద్ధి చెబుతారని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. సేవల్లో తమతో పోటీ పడాలే కానీ.. అనవసర విమర్శలు చేసి ప్రజలను అయోమయానికి గురి చేయడం తగదని హితవు పలికారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనిట్ లిమిటెడ్ అనంతపురం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల పాలక వర్గ సభ్యులకు సంఘం నిర్వహణ, విధులు, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం కో ఆపరేటివ్ విద్యాకమిషనర్ నరసింహారెడ్డి, రిసోర్స్ పర్సన్ భాస్కరరెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అర్హులైన 189 మంది మహిళలకు రూ.30.20 లక్షల విలువైన చెక్కులు అందజేశారు.

త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకున్న విజేతలు

నంద్యాల(న్యూటౌన్): పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి 8వ త్రోబాల్ పోటీల్లో గురురాజ విద్యార్థులు డబుల్ క్రౌన్ సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు షేక్షావలిరెడ్డి, మౌలాలిరెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన త్రోబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాల స్థాయిలో వంద జట్లకు పైగా పాల్గొన్నాయి. ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు మెడల్స్ అందజేశారు.

విజేతలు వీరే..

బాలుర విభాగంలో ప్రథమస్థానం, గురురాజ ఇంగ్లిష్ మీడియం, ద్వితీయ స్థానం కర్నూలు విజ్ఞాన పీఠం, తృతీయ స్థానం కేశవరెడ్డి పాఠశాల, నాల్గవ స్థానం జిల్లా పరిషత్ హైస్కూల్ భాగ్యనగరం నిలువగా బాలికల విభాగంలో ప్రథమస్థానంలో గురురాజ ఇంగ్లిష్ మీడియం, ద్వితీయ స్థానం గుడ్ షెప్పర్డ్, తృతీయ స్థానం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ కరిమద్దెల, నాల్గవ స్థానం కర్నూలు విజ్ఞాన పీఠం విద్యార్థులు ప్రతిభ చూపారు.

మంత్రి కార్యాలయంలో గ్రీవెన్స్

నంద్యాల(రూరల్): పట్టణంలోని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కార్యాలయం (టీడీపీ)లో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వినతి పత్రాలతో ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను తెలుసుకున్న మంత్రి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కారించాలని సూచించారు.

విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సత్తెన్న, రఫీ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పద్మావతినగర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ట్రూఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని మోపడం దారుణమన్నారు. ఇప్పటికే పెట్రోల్, గ్యాస్, డీజిల్, నిత్యావసర దరలు పెరగటంతో సామాన్యప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు, పీడీఎస్‌యూ నాయకులు షాహిద్, ఉపేంద్ర, విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్రసభను జయప్రదం చేయండి..

పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో మంగళవారం జరిగే రాష్ట్రసభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు షాహిద్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. రఫీ అధ్యక్షతన జరిగే సభకు పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ హృదయరాజు, ఉమ్మడిజిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, రాష్ట్రప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, తెలంగాణా రాష్ట్రకార్యదర్శి సాంబ, వెంకటేశ్వర్లు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలుకే


అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు

ఆళ్లగడ్డ: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని సహాయ కార్మిక శాఖ అధికారి మురళికృష్ణ అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు వ్యాపార సంస్థలు, హోటళ్లు, మెకానిక్ షెడ్‌లలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి యజమానులకు ఆరు నెలల నుంచి ఏడాది జైలు.. రూ 10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. అధికారులు విద్యావతమ్మ, సమీర్, రాజు ఉన్నారు.

డ్వాక్రా సంఘాలకు రూ. 13 కోట్ల రుణాలు

శిరివెళ్ల: డ్వాక్రా సంఘాలకు రూ.13 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను పంపిణీ చేసినట్లు వెలుగు ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,169 సంఘాలకు రూ. 56 కోట్ల రుణాలు పంపిణీ లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు 438 సంఘాలకు రూ. 14 కోట్లు పంపిణీ జరిగిందన్నారు. అలాగే స్త్రీ నిధి కింద రూ. 6 కోట్లకు గాను రూ. 2.30 కోట్లు రుణాలు అందజేశారని తెలిపారు. ఉన్నతి కింద మండలానికి రూ. 50 లక్షల రుణాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. సీనియార్టీ, రికవరీ ఆధారంగా ప్రతి సంఘానికి గరిష్టంగా రూ. 20 లక్షల రుణాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు 20 సంఘాలకు ఆ రుణాలను అందచేశామన్నారు. ఈ ఏడాది 22 మంది అభయ హస్తం పింఛన్లు మంజూరయ్యాయన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సైమాన్

గోస్పాడు: వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని ఎంపీపీ ఆర్థర్ సైమాన్, జెడ్పీటీసీ జగదీశ్వరమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వెలుగు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి ఆ శాఖలో జరిగే అభివృద్ధిని వివరిస్తుండగా ఎంపీపీ, ఉప మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి కల్పించుకుంటూ.. గ్రామాల్లో ఐకేపీ సిబ్బంది పొదుపు గ్రూపుల గ్రామైక్య సంఘాలను, వీఓఏలను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పొదుపు సంఘాలకు ఇబ్బంది కలిగించేలా సిబ్బంది వ్యవహరిస్తున్నారని, అలాంటి పొరపాట్లు జగరకుండా సిబ్బందికి సూచించాలని చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ హౌసింగ్ ద్వారా గ్రామాల్లో ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు మంజూరు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఉప మండలాధ్యక్షుడు రాజు, ఎంపీడీఓ అమానుల్లా, ఈఓఆర్‌డీ నాగఅనసూయ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు



ప్రథమ నంది ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వరస్వామి


స్ఫటిక లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శైవ క్షేత్రాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు. ప్రథమనంది, సోమనంది, బ్రహ్మనందీశ్వర ఆలయం, నాగనంది, నాగలింగేశ్వరస్వామి, కాశికాంబ చంద్రశేఖర, సంజీవనగర్ రామాలయం, స్ఫటిక లింగేశ్వర, తదితర దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాల అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం దేవాలయాల్లో ఆకాశ దీపాన్ని వెలిగించి స్వామివారికి నాగాభరణాన్ని అలంకరించి విశేష పూజలు జరిపించారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాస దీక్షతో ఉండి సాయంత్రం నక్షత్రాలను చూసి దీక్ష విరమించారు.

వాలీబాల్ విజేత బనగానపల్లె


విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామంలో మార్థోమా చర్చి 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో బనగానపల్లె జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో బాచేపల్లె జట్టు, మూడో స్థానంలో మైదుకురు జట్లు నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7,500, మూడో బహుమతి రూ.5 వేల చొప్పున వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ చిన్నబికారి, షేక్ బాషాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తలారి నరసింహుడు, షాలోమ్, రాముడు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

గోస్పాడు: పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో పంటలు నష్టపోయిన సమయాల్లో పరిహారం అందుకోవాలంటే పంటల బీమా ప్రీమియం తప్పనిసరిగా చెల్లించాలన్నారు. శనగ, వరి, జొన్న, మినుము, వేరుశనగ, ఉల్లి పైర్లకు మాత్రమే బీమా చెల్లించుకొనే అవకాశం ఉందన్నారు. ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 15 వరకు గడువుందని చెప్పారు. ప్రీమియాన్ని సచివాలయాలు, ఉమ్మడి సేవా కేంద్రాల్లో చెల్లించవచ్చన్నారు.

7న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

శిరివెళ్ల: ఆళ్లగడ్డ ప్రాజెక్ట్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఈ నెల 7వ తేదీ నంద్యాల ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఐసీడీఎస్ సీడీపీఓ తేజస్విని తెలిపారు. సోమవారం యర్రగుంట్ల, గుంప్రమాన్‌దిన్నె, గాంధీనగరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ పరిధిలో 3 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 9 దరఖాస్తులు, 11 ఆయా పోస్టులకు 36 దరఖాస్తులు అందాయని తెలిపారు. అలాగే 19 అంగన్‌వాడీ కేంద్రాలను సాక్ష్యం అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. శిరివెళ్ల మండలంలోని గుంప్రమాన్‌దిన్నె, గాంధీనగరం, రుద్రవరం మండలంలోని కోటకొండ, ఉయ్యాలవాడ మండలంలో ఇంజేడు, సర్వాయిపల్లె, మాయలూరు, అల్లూరు కేంద్రాలు ఎంపికయ్యాయన్నారు. ఆళ్లగడ్డ మండలంలో శాంతినగరం, నందిపల్లె, ఆర్.కృష్ణాపురం, బత్తులూరు, దొరకొట్టాల, బి.తండా, దొర్నిపాడు మండలంలో కిష్టిపాడులో రెండు కేంద్రాలు, , చాకరజాముల, ఇందిరా నగర్, కొండాపుర్ అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపికయ్యాయని వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో ఆకుకూరలు, కూరగాయల పెంపకం, ప్రీస్కూల్ పిల్లల ప్లే మెటీరియల్ కోసం ప్రభుత్వం ఒక్కో కేంద్రానికి రూ. 45 వేల నిధులను మంజూరు చేసిందన్నారు.

వీఆర్‌ఏల నైట్ డ్యూటీలను రద్దు చేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల వద్ద వీఆర్‌ఏలకు కేటాయించిన నైట్ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని వీఆర్‌ఏలు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, సహాయ కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు ఇంటర్మీడియెట్ విద్యార్హత ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను అర్హులతో భర్తీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. వీఆర్‌ఏల సంఘం నాయకులు రవికుమార్, మహేశ్వరనాయుడు, రామచంద్రుడు, హరికృష్ణ, శివరామకృష్ణ, మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

